క్లుప్తంగా

కదలని ఆర్టీసీ బస్సులు

మణుగూరుటౌన్: వరద ప్రభావంతో ఆర్టీసి బస్సులు ఆదివారం మణుగూరు డిపోకే పరిమితమయ్యాయి. మణుగూరు నుంచి కొత్తగూడెం, ఖమ్మంతో పాటు విజయవాడ, హైదరాబాద్ వెళ్లాల్సిన సుమారు 65 అద్దె బస్సులు డిపోకే పరిమితమవగా, వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. వరద ఉధృతి తగ్గిన అనంతరం మధ్యాహ్నం 3గంటల తర్వాత నుంచి బస్సులు పునరుద్ధరించినట్లు డీఎం శ్యామ్ తెలిపారు.

రైలు రద్దు..
ప్రతి రోజూ మణుగూరు నుంచి సికింద్రాబాద్ రాత్రి 9.40కి బయల్దేరాల్సిన రైలును రద్దు చేసినట్లు రైల్వే అధికారులు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

బాధితుడికి ఆర్థిక సాయం

దుమ్ముగూడెం: అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి నర్సాపురం ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం చిన్న అరుణాచలం వారు రూ.4వేలు నగదు, బియ్యం, నిత్యావసరాలు వితరణగా ఆదివారం అందజేశారు. మండలంలోని మంగువాయిబడవ గ్రామానికి చెందిన పొడియం సురేష్ ఇల్లు విద్యుత్ షార్ట్ షర్క్యూట్‌తో దగ్ధమై కట్టుబట్టలతో మిగిలిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు శివనాగస్వామి, చిన్న అరుణాచలం సేవకులు శ్రీకాంత్ రెడ్డి, భార్గవ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు చేయండి

అశ్వారావుపేటరూరల్: భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న రోడ్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కట్రం స్వామి దొర, పార్టీ మండల అధ్యక్షుడు నార్లపాటి శ్రీను అధికారులను డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని అనంతారం గ్రామంలో జూలై 18వ తేదీన కురిసిన భారీ వర్షం, వరద కారణంగా భారీగా కోతకు గురైన బీటీ రహదారి వద్ద ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. దారులకు గండ్లు, కోతకు గురై 45రోజులు దాటుతున్న అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే మరమ్మతులు జరిపించాలని కోరారు. టీడీపీ కార్యకర్తలు బ్రహ్మం, రెడ్డి, కిషోర్, వంశీ, వినోద్, చందు పాల్గొన్నారు.

చెట్ల తొలగింపు

భద్రాచలంఅర్బన్: మానవాళికి హానీ కలిగించే కోనోకార్పస్ చెట్లను గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగించారు. ఆదివారం భద్రాచలం పట్టణంలోని ఐటీడీఏ రోడ్డులో ఉన్న కోనోకార్పస్ చెట్లను పూర్తిగా తొలగించారు. ఈ మొక్కల స్థానంలో ఇతర మొక్కలు నాటుతామని గ్రామ పంచాయతీ ఈవో శ్రీనివాస్ రావు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని తిరుమలకుంట గ్రామంలో ఆదివారం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాసంలో చివరి ఆదివారం కావడంతో మహిళలు, యువతులు బోనాలతో గ్రామంలో ఊరేగింపుగా గ్రామ శివారులోని ముత్యాలమ్మ తల్లి ఆలయానికి చేరుకొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి అమ్మవారికి సమర్పించారు. అలాగే గ్రామ నడిబొడ్డులో ఉన్న బొడ్రాయి వద్ద పూజలు చేశారు. రకరకాల పిండి వంటలు, పాలతో నైవేద్యాలు తీసుకొచ్చి గ్రామ దేవతకు సమర్పించారు. ఉత్సవాలను మేళతాళాలతో వైభవంగా నిర్వహించగా, చిన్నారులు నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. దీంతో గ్రామంలో బోనాల సందడి నెలకొంది.

సంతకాల సేకరణ

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీ నగరం గ్రామంలో ప్రైమరీ పాఠశాల ఏర్పాటు కోసం ఆదివారం గ్రామస్తులు సంతకాల సేకరణ చేపట్టారు. గ్రామంలోని సీఎస్ఐ ఎయిడెడ్ పాఠశాలలో యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేయకపోవడంతో గత రెండు నెలలుగా పాఠశాల మూసి ఉంది. గతం ఎంతో ఘన కీర్తిగా సాగిన సీఎస్ఐ పాఠశాల పరిస్థితి నేడు ఈ దుస్థితికి చేరడంతో పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు గ్రామస్తుల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. సంతకాల సేకరణలో మాజీ ఉప సర్పంచ్ గుడ్ల రామ్మోహన్‌రెడ్డి,డింగి కన్నారెడ్డి, బేరి విరేందర్‌రెడ్డి, డల్లి హరిబాబు,పంపన పవన్,మురళి, శ్రీను, మస్తాన్ పాల్గొన్నారు.

అలుగు పెంచేందుకు చర్యలు


పనులను పరిశీలిస్తున్న దృశ్యం

అశ్వాపురం: మండల పరిధిలోని తుమ్మలచెరువు అలుగు ఉధృతంగా ప్రవహిస్తూ చెరువు కట్టకు ప్రమాదం పొంచి ఉండటంతో రైతులు, స్థానిక నాయకులు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే తక్షణమే స్పందించి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించడంతో జేసీబీ యంత్రంతో చెరువు వద్ద అలుగు పెంచేందుకు చర్యలు చేపట్టారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యేకు రైతులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.


బూర్గంపాడు: కిన్నెరసాని వరదలో నీటమునిగిన ట్రాక్టర్


మణుగూరుటౌన్: ముంపునకు గురైన మణుగూరు కోర్టు పరిసరాలు


దుమ్ముగూడెం: బుర్రవేముల దగ్గర ప్రధాన రహదారి పైకి చేరిన వర్షపు నీరు


చర్ల: మండలంలోని లింగాపురం సమీపంలో నీట మునిగిన ఈతవాగు లోలెవల్ చప్టా


ములకలపల్లి: అలుగుపోస్తున్న మూకమామిడి..

నిండా ముంచిన వాన

ఏకధాటిగా కురిసిన వర్షం గ్రామాలు, పట్టణాలను ముంచెత్తింది. అనేక ప్రాంతాలు అతలాకుతలం అయ్యాయి. నివాస ప్రాంతాలను వరద చుట్టుముట్టడంతో జనజీవనం స్తంభించింది. పూరిగుడిసెలు నేలమట్టం అయ్యాయి. వాగులు, చప్టాలు రహదారులపై పొంగిపొర్లి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వ్యవసాయ క్షేత్రాలు వర్షార్పణమయ్యాయి. అధికారులు ప్రమాదకర ప్రాంతాలపై దృష్టి సారించారు.

ముఖ్యంగా మణుగూరు పట్టణంలోని సుందరయ్యనగర్, వినాయకనగర్, లారీ కాంటా ప్రాంతం, మండల శివారు అశోక్‌నగర్ ప్రాంతాలు ఒక్కసారిగా ముంపునకు గురయ్యాయి. రాత్రి వేళ నిద్రిస్తున్న ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. గత 3 దశాబ్దాలుగా ఏనాడు లేని ముంపు ఒక్కసారిగా కమ్ముకోవడంతో ప్రజలు అర్ధరాత్రి జాగారం చేశారు. ఇంటి సామాన్లన్నీ వరద ప్రవాహంతో కొట్టుకుపోయాయి. అధికారులు ప్రజలను ఎగువ ప్రాంతాలకు తరలించే ప్రయత్నం చేశారు.

ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల సీతారామచంద్రస్వామి నారచీరల ప్రాంతం పూర్తిగా నీరు చేరడంతో సీతమ్మ విగ్రహం పూర్తిగా నీట మునిగింది. అక్కడి దుకాణాలు నీటిమయం అయ్యాయి.

అశ్వాపురం మండలంలోని తుమ్మలచెరువు అలుగు వరద భారీగా ప్రవహిస్తోంది. అలుగు ప్రవహించే మార్గం తక్కువగా ఉండటంతో చెరువు కట్ట కోతకు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది. అదే జరిగితే సీతారామ కెనాల్ మునిగిపోవడంతో పాటు సుమారు 10 గ్రామాలు కొట్టుకుపోతాయి.

– సాక్షి నెట్‌వర్క్


పినపాక: ఉధృతంగా ప్రవహిస్తున్న బయ్యారం పెద్దవాగు


అశ్వాపురం: ఎలకలగూడెం వద్ద వరద..


అన్నపురెడ్డిపల్లి: అబ్బుగూడెం వద్ద వాగు


మణుగూరుటౌన్: కొట్టుకు వచ్చిన కారుపై మంచం


భద్రాచలంఅర్బన్: ఐటీడీఏ సిబ్బంది నివసించే ఇంటి ప్రహరీ కూలిన దృశ్యం


మణుగూరుటౌన్: మామిడితోట ఏరియాలో నీట మునిగిన బ్రిడ్జి


గుండాల: లోలెవల్ వంతెనపై ఏడుమెలికల వాగు ఉధృతి


అశ్వారావుపేటరూరల్: వాగొడ్డుగూడెం వాగు


అశ్వాపురం: మొండికుంటలో సహకార సంఘం కార్యాలయంలో తడిసిపోయిన ఎరువుల బస్తాలు


కరకగూడెంలో ఇళ్ల సమీపంలోకి వచ్చిన వరద నీరు


బూర్గంపాడు: వర్షానికి దెబ్బతిన్న పత్తిచేను


అశ్వాపురం: మణుగూరు-కొత్తగూడెం ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న చెరువు అలుగు నీరు


పినపాక: గోపాలరావు పేట గ్రామంలో భారీ వర్షాలకు నేలకూలిన పూరిల్లు


బూర్గంపాడు: కిన్నెరసాని వరద ఉధృతికి నీటమునిగిన వరి మాగాణులు


కరకగూడెంలో ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్ద వాగు


భద్రాచలంఅర్బన్: ఏఎస్ఆర్ కాలనీలో నిలిచిన వర్షపు నీటిని మళ్లిస్తున్న అధికారులు


కరకగూడెం: నీట మునిగిన పంట పొలాలు

పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలి

భద్రాచలంఅర్బన్: ఇటీవల కేంద్ర ప్రభుత్వం యూనిఫైడ్ పెన్షన్ స్కీం (యూపీఎస్) ప్రకటించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులను మరో రూపంలో మరోసారి మోసం చేయాలని చూస్తోందని, పాత పెన్షన్ విధానాన్నే పునరుద్ధరించి అమలు చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు బుటారి రాజు అన్నారు. స్థానిక టీపీటీఎఫ్ కార్యాలయంలో పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా ఆదివారం జరిగిన నిరసన కార్యక్రమంలో బి రాజు, ఎం.రామాచారి, టి.సత్తిబాబులు మాట్లాడుతూ.. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం, గ్యారెంటీ పెన్షన్ స్కీమ్, యూనిఫైడ్ పెన్షన్ స్కీం లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఉపాధ్యాయులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, వెంటనే విరమించుకుని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పూర్వ కార్యదర్శి, ఉపాధ్యాయ దర్శిని సంపాదక వర్గ సభ్యులు మునిగడప రామాచారి, జిల్లా ఉపాధ్యక్షుడు తాటి సత్తిబాబు కృష్ణయ్య, ముత్తయ్య, సత్తెమ్మ, ప్రకాష్ రావు, లక్ష్మి, సరస్వతి, రఘునందన్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా రెస్క్యూ చర్యలు


అనారోగ్యంతోనూ సహాయక చర్యల్లో పాల్గొన్న ఎస్‌ఐ రంజిత్


ముంపు ప్రాంతాల్లో స్థానికులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న డీసీసీబీ డైరెక్టర్ బ్రహ్మయ్య


పునరావాస కేంద్రం వద్ద..

మణుగూరుటౌన్: శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి మణుగూరు మండలంలోని బాలాజీనగర్, శేషగిరినగర్, ఆదర్శ్‌నగర్, మామిడిచెట్ల గుంపు, సుందరయ్యనగర్, వినాయకనగర్, అశోక్‌నగర్ శివారు ప్రాంతమైన గుండు సింగారం తదితర ప్రాంతాలు నీటమునిగగా.. పలు డిపార్ట్‌మెంట్ల అధికారులు ముమ్మరంగా రెస్క్యూ చర్యలు చేపట్టారు.

పోలీసుల సాహస సేవలు..
ఎస్‌ఐ మేడ ప్రసాద్ ఉధృతంగా ప్రవహిస్తున్న వరద ప్రవాహంలోనూ ఓ బాలుడిని కాపాడారు. మరో ఎస్‌ఐ రంజిత్ తీవ్ర జ్వరంతో రెండు రోజులుగా బాధపడుతున్నప్పటికీ ఆయన సైతం వరద సహాయక చర్యల్లో పాల్గొన్నారు. పుట్టిలు ఏర్పాటు చేసి సీఐ సతీష్‌కుమార్ లోతట్టు ప్రాంతాల ప్రజలను దగ్గరుండి ఎగువ ప్రాంతాలకు తరలించారు. రాత్రి ప్రారంభమైన వరద సుందరయ్యనగర్‌లో ఉదయం 8గంటలకు అదుపులోకి రాగా, అశోక్‌నగర్‌లోని పాత పోలీస్‌కాలనీ వద్ద మధ్యాహ్నం 1గంటకు అదుపులోకి వచ్చింది. రాత్రి నుంచి పోలీసులు, రెవెన్యూ అధికారులు సహాయక చర్యల్లోనే ఉన్నారు. ఆర్ఐ లీలావతి, శ్రీనివాసరావు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో నేతల పర్యటన..
ముంపు ప్రాంతాల్లో జిల్లా కాంగ్రెస్ నాయకులు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరు బ్రహ్మయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిరినాకి నవీన్, గుడిపూడి కోటేశ్వరరావు, దొబ్బల వెంకటప్పయ్య, పుచ్చకాయల శంకర్, సామా శ్రీనివాసరెడ్డి, అబ్దుల్లా, తిరుమలేశ్, పాతూరి వెంకన్నలు పర్యటించి వివరాలు సేకరించారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు సుందరయ్యనగర్ ప్రాంతంలో బాధితులకు నాయకులు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. అదే విధంగా సుందరయ్యనగర్‌లో ముంపునకు గురై వికలాంగుడు నందికోళ్ల రాము(29) మృతి చెందగా, తల్లి రత్నంకు మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు.

పునరావాస కేంద్రాల ఏర్పాటు..
మున్సిపాలిటీలో ముంపునకు గురైన ప్రజలకు విద్యుత్ తీవ్ర అంతరాయం ఏర్పడగా, మున్సిపాలిటీ ఆధర్యంలో ట్యాంకుల ద్వారా తాగునీరు వసతి ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం శ్రీవిద్య డిగ్రీ కళాశాలలో తహసీల్దార్ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా.. అశోక్‌నగర్, సమితిసింగారం ముంపు గ్రామస్తులకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేసి పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించారు.

మెగా వైద్యశిబిరం

మణుగూరురూరల్: మండలంలోని మణుగూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో పొంగులేటి స్వరాజ్యం రాఘవరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భద్రాచలం కిమ్స్ హాస్పిటల్స్ వారి సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరం విజయవంతమైంది. ఈ వైద్యశిబిరంలో సుమారు 450 మంది రోగులకు వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించారు. షుగర్, బీపీ, ఈసీజీ పరీక్షలు చేసి నివారణ మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఏజెన్సీ ప్రాంతమైన మణుగూరులో మెగా వైద్యశిబిరం నిర్వహించి సేవలు అందించడం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్ యాజమాన్యం భీమ్‌రెడ్డి బాబురెడ్డి, చావా శివరామకృష్ణ, హాస్పిటల్ సిబ్బంది, మార్కెటింగ్ టీమ్ పాల్గొన్నారు.

ఏఐటీయూసీ నూతన కమిటీ ఎన్నిక

అశ్వారావుపేట: ఏఐటీయూసీ మండల నూతన కమిటీను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు తాజాగా జరిగిన ఏఐటీయూసీ 18వ మహాసభలో నూతన కమిటీని ఎన్నుకోగా, కమిటీ గౌరవ అధ్యక్షుడిగా ఎస్‌డీ సలీం, నూతన అధ్యక్షుడిగా పఠాన్ జలాల్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అద్దంకి సాయి విష్ణు, ప్రధాన కార్యదర్శిగా దోమల అనిల్, ఉపాధ్యక్షురాలిగా రాములమ్మ, గంద్రల నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా ఎస్‌కె.రహీంతుల్లా, బి.సాయి, ఎండి.ఆసీఫ్, ఉప్పతల వెంకటేశ్వరరావు, పడాల సాయి, చిలకారావు, కోశాధికారిగా కె.శ్రీనుతోపాటు మరికొంతమంది సభ్యులను ఎన్నుకున్నట్లు కమిటీ బాధ్యులు తెలిపారు.

చర్చి కౌన్సిల్ గ్రూప్ సెక్రటరీకి సన్మానం

భద్రాచలంఅర్బన్: దుమ్ముగూడెం గ్రూప్ చర్చి కౌన్సిల్ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన పాల రితీష్ రెడ్డిని ఆదివారం భద్రాచలం పట్టణంలోని సీఎస్ఐ చర్చి లో సీఎస్ఐ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఎస్ఐ చర్చి పాస్టరేట్ చైర్మన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. కరోనా సమయంలో శృతి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంతో మందికి సహాయం చేసి, వారిని రక్షించిన ఘనత పాల రితీష్ రెడ్డికి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో పాస్టరేట్ ట్రెజరర్ ఎం.సైమన్, సభ్యులు ప్రసాద్‌రావు, నవీన్, పి.రాజు, స్రవంత్, ప్రభు, రవికిశోర్,రత్నకుమారి, హరిత, సునీత, లక్ష్మీకాంత, దివ్య, పాల్వాయి. మధు, శాంతమ్మ, జయకర్, తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రభావిత ప్రజలను ఆదుకోవాలి

మణుగూరురూరల్: భారీ వర్షాలతో ఇక్కట్లు ఎదుర్కొంటున్న ప్రజలకు బీఆర్ఎస్ శ్రేణులు అండగా నిలవాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పిలుపునిచ్చారు. ఎడతెరిపి లేని వర్షంతో మణుగూరు జలమయం కాగా, బాధితులకు పునరావాసం కల్పించడంలో ప్రభుత్వం, అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. ఈ నేపథ్యాన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వరద సహాయక చర్యల్లో పాల్గొని బాధితులకు భోజనం, తాత్కాలిక వసతి, వైద్యసౌకర్యం వంటివి కల్పించాలని సూచించారు. కాగా, వేసవిలోనే కట్టువాగు, మెట్టవాగు, కోడిపుంజుల వాగులకు పూడిక తీత తీయించకపోవడం, డ్రెయినేజీలు శుభ్రం చేయించకపోవడంతో ప్రస్తుత పరిస్థితి ఎదురైందని ఆయన ఆరోపించారు. మణుగూరు పట్టణాభివృద్ధికి తమ ప్రభుత్వం రూ.155 కోట్లు కేటాయిస్తే ప్రస్తుత సీఎం నిధులు రద్దు చేశారని ఆయన ఓ ప్రకటనలో విమర్శించారు.

చర్యలు చేపట్టాలి..
వరద ప్రభావిత గ్రామాల ప్రజలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు దుర్గ్యాల సుధాకర్, జంగం మోహన్‌రావులు డిమాండ్ చేశారు. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు జలమయమైన లోతట్టు ప్రాంతాలను వారు ఆదివారం సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రతీ ఏటా ముందస్తు ప్రణాళికలు లేకపోవడం వల్లే వాగులు ఉధృతంగా ప్రవహించి లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి వరదనీరు చేరుతోందని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాగుల్లో పూడికను తీయించాలని, సైడ్‌డ్రైన్లలోని చెత్తాచెదారాన్ని శుభ్రం చేయించాలని డిమాండ్ చేశారు. భారీ వర్షానికి గోడలు, ఇళ్లు కూలిపోయిన బాధితులను ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ఎస్‌కె సర్వర్, సోందె కుటుంబరావు, మంగి వీరయ్య, ఎస్‌వి.నాయుడు, రాములు, కె.సీతారాములు, ప్రసాద్ పాల్గొన్నారు.

ములకలపల్లి: అకాల వర్షాలతో పంట దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు డిమాండ్ చేశారు. కొత్తూరు శివారు గండిపడ్డ సీతారామ ప్రాజెక్ట్ కాలువను, మండలపరిధిలోని వేముకుంట, వీకే.రామవరం, కొత్తూరు గ్రామాల్లో వర్షంధాటికి దెబ్బతిన్న పంటలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర నివేదిక రూపొందించాలని సూచించారు. గుగులోతు దేవేందర్, పొడియం వెంకటేశ్వర్లు, నిమ్మల మధు, సోయం వీరస్వామి, గుగులోతు రాజు, సుధాకర్, హేమాని, బాణోతు వీరు తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణ ప్రజలకు తాగునీరు అందించే మిషన్ భగీరథ పథకంలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలని పట్టణంలో పంప్ హౌస్ వద్ద ఆదివారం నిరసన చేపట్టారు. గడిచిన 5 నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని ఇలాంటి పరిస్తుతుల్లో తాము ఎలా బ్రతకాలని కార్మికులు ప్రశ్నించారు. గడిచిన రెండు రోజులుగా నిరసన చేస్తుండటంతో పట్టణంలో తాగునీరు సరఫరా నిలిచిపోయింది. దీనిపై భద్రాచలం వచ్చిన మిషన్ భగీరథ గ్రిడ్ అధికారిణి ఈఈ నళినీ కార్మికులతో మాట్లాడుతూ.. ప్రస్తుతం అధికార యంత్రాంగం మొత్తం వర్షాల వల్ల వచ్చిన విపత్తులపై నిమగ్నమై ఉందన్నారు. 15 రోజుల్లో వేతన బకాయిలు ఇప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో నిరసనను తాత్కాలికంగా విరమించారు. దీంతో నేటి నుంచి తాగునీరు యథాతథంగా సరఫరా చేయనున్నారు.


దుమ్ముగూడెం: నిరసన తెలియజేస్తున్న మిషన్ భగీరథ కార్మికులు

దుమ్ముగూడెం: మిషన్ భగీరథ మంచినీటి సరఫరా విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు రావాల్సిన 5 నెలల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.పద్మ డిమాండ్ చేశారు. ఆదివారం వేతనాలు రాకపోవడంతో కార్మికులు సమ్మె చేపట్టారు.సమ్మెను ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ.. నెలల తరబడి వేతనాలు రాకుండా కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారులకు, కాంట్రాక్టర్‌కు అనేక సార్లు కార్మికులు వారి గోడు వెళ్ళబోసుకున్నప్పటికీ స్పందన కరువైందని అన్నారు. ప్రజలకు తాగునీరు అందిస్తున్న మిషన్ భగీరథ కార్మికుల పట్ల ప్రభుత్వం బాధ్యత లేకుండా వ్యవహరిస్తోందని విమర్శించారు. విష జ్వరాల చికిత్స, పిల్లల చదువులు, కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ కార్మికుల అధ్యక్ష, కార్యదర్శులు జి.శ్రీను, సాయి చందు దాసు, పవన్, సాయి రెడ్డి, పవన్ రెడ్డి, కల్యాణ్, కాము, సోమరాజు పాల్గొన్నారు.